## ఐనవోలు మల్లన్న జాతరకు రండి

### సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రి సురేఖ, ఎమ్మెల్యే నాగరాజు ఆహ్వానం

ఐనవోలు, జనవరి 9 : ఈ నెల 13నుంచి ప్రారంభమయ్యే ఐనవోలు మల్లికార్జునస్వామి జాతరకు రావాలని సీఎం రేవంత్‌రెడ్డిని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు ఆహ్వానించారు. ఈమేరకు మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి మల్లన్న చిత్రపటం, ఆహ్వాన పత్రిక, లడ్డూ ప్రసాదం అందజేశారు. ఇక్కడ ఉప ప్రధాన అర్చకుడు రవీందర్, వేదపండితులు గట్టు పురుషోత్తమశర్మ, విక్రాంత్ వినాయక్ జోషి, జూనియర్ అసిస్టెంట్ అద్దంకి కిరణ్‌కుమార్ ఉన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డికి జాతర ఆహ్వాన పత్రికను అందజేస్తున్న మంత్రి సురేఖ, ఎమ్మెల్యే నాగరాజు, ఈవో నాగేశ్వర్‌రావు

## 15శాతం జీతం పెంచండి

### రీజియన్ అధ్యక్షుడికి అద్దె బస్సు డ్రైవర్ల వినతి



వినతిపత్రం అందజేస్తున్న అద్దెబస్సు డ్రైవర్లు


హనుమకొండ చౌరస్తా, జనవరి 9 : మహాలక్ష్మీ పథకం ప్రారంభమైనప్పటి నుంచి తమకు కష్టాలు మొదలయ్యాయని ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫ్రీ బస్‌తో ఓవర్‌లోడ్ అయి క్లచ్‌ప్లేట్లు, కట్టలు విరగడం, టైర్లు పగులుతున్నందున భయంతో డ్రైవింగ్ చేయాల్సి వస్తున్నదని చెప్పారు. ఈమేరకు తమ సమస్యలు పరిష్కరించాలని అద్దె బస్సు ఓనర్ల యూనియన్ రీజినల్ అధ్యక్షుడు మారిపెల్లి రామిరెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. బస్సు స్టేజీ మీదకు రాకముందే సీట్ల కోసం ఎగబడుతుండడం వల్ల సైడ్‌గ్లాస్‌లు బ్రేక్ అవుతున్నాయని, యాక్సిడెంట్లు అయ్యే అవకాశం ఉందని, కేఎంపీఎల్ రాక ఒత్తిడికి గురవుతున్నామన్నారు. ఫుట్‌బోర్డు ప్రయాణం వద్దని చెబితే డ్రైవర్లపైనే దాడి చేస్తున్నారని, ప్రతి గ్రామానికి 5, 6 స్టేజీల్లో ఆపడం, ఎక్కడం వల్ల పని భారం పెరుగుతున్నందున డ్రైవర్ల జీతాన్ని 15 శాతం పెంచాలని డిమాండ్ చేశారు. యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బుర్ర హరి, పాడపల్లి శివ, రాజు ఉన్నారు.

# లోక్‌సభకు సమాయత్తం

### పార్లమెంట్ ఎన్నికలకు బీఆర్‌ఎస్ సన్నద్ధం




- నేడు వరంగల్, రేపు మహబూబాబాద్ లోక్‌సభ సెగ్మెంట్ల సమీక్ష
- తెలంగాణ భవన్‌లో ముఖ్యనేతలతో సమావేశాలు
- గెలుపే లక్ష్యంగా దిశానిర్దేశం




వరంగల్, జనవరి 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : లోక్‌సభ ఎన్నికలకు బీఆర్‌ఎస్ సమాయత్తమవుతున్నది. ఇందులో భాగంగా పార్లమెంట్ సెగ్మెంట్ల వారీగా ముఖ్యనేతలతో సమావేశాలు నిర్వహిస్తున్నది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సమీక్షలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా నేడు వరంగల్, రేపు మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల సమీక్షలు ఉండగా ఆయా సెగ్మెంట్ల ముఖ్యనేతలు హాజరుకానున్నారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ దిశానిర్దేశం చేయనున్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్‌ఎస్ లోక్‌సభ నియోజకవర్గాల వారీగా ముఖ్య నేతలతో సమావేశాలు నిర్వహిస్తున్నది. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం వరంగల్ లోక్‌సభ సెగ్మెంట్ ముఖ్యనేతలతో, గురువారం మహబూబాబాద్ లోక్‌సభ సెగ్మెంట్ పరిధి నేతలతో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమీక్షలు నిర్వహించనున్నారు. సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, జడ్పీ చైర్ పర్సన్లు, మేయర్, మున్సిపాలిటీల చైర్మన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఇతర ముఖ్యనేతలు ఈ సమావేశానికి హాజరు కానున్నారు. వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమం, వర్ధన్నపేట, పరకాల, భూపాలపల్లి, స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ముఖ్యనాయకులు హాజరు కానున్నారు. మహబూబాబాద్ లోక్‌సభ సెగ్మెంట్ సమావేశంలో మహబూబాబాద్, డోర్నకల్, నర్సంపేట, ములుగు, ఇల్లందు, పినపాక, భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గాల ముఖ్యనేతలు పాల్గొంటారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్‌ఎస్ శ్రేణులను సన్నద్ధం చేసేందుకు ఈ సమావేశాలు నిర్వహిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై సమీక్షతో పాటు లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించే వ్యూహంపై శ్రేణులకు వివరించనున్నారు. లోక్‌సభ సెగ్మెంట్ సమావేశాలకు సన్నాహకంగా ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జిలు డివిజన్లు, మండలాల వారీగా ముఖ్యనేతలతో సమావేశాలు నిర్వహించారు.

### బీఆర్‌ఎస్‌కు బలమైన స్థానాలు

వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ సెగ్మెంట్లు మొదటి నుంచీ బీఆర్‌ఎస్‌కు బలమైన స్థానాలుగా ఉన్నాయి. పార్టీ ఆవిర్భావం నుంచి రెండు స్థానాల్లోనూ బీఆర్‌ఎస్ ఆధిక్యత కనబరుస్తూ వచ్చింది. 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో రెండు స్థానాల్లోనూ పార్టీ విజయం సాధించింది. వరంగల్ లోక్‌సభ సెగ్మెంట్‌లో 2014 ఎన్నికల్లో కడియం శ్రీహరి, 2015 (ఉప ఎన్నిక), 2019 ఎన్నికల్లో పసునూరి దయాకర్ బీఆర్‌ఎస్ అభ్యర్థులుగా రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో గెలుపొందారు. మహబూబాబాద్‌లోనూ భారీ ఆధిక్యతతో బీఆర్‌ఎస్ అభ్యర్థులు వరుసగా రెండు ఎన్నికల్లో గెలిచారు. ఈ సెగ్మెంట్‌లో 2014 ఎన్నికల్లో అజ్మీరా సీతారాం నాయక్, 2019లో మాలోత్ కవిత ఘన విజయం సాధించారు. బీఆర్‌ఎస్‌కు మొదటి నుంచీ కంచుకోటలుగా ఉన్న ఈ సెగ్మెంట్లలో మరోసారి సత్తా చాటేందుకు గులాబీ పార్టీ కార్యాచరణ రూపొందిస్తున్నది. ఇందుకు అనుగుణంగా లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నది. పార్లమెంట్‌లో బీఆర్‌ఎస్ ఎంపీలు ఉంటేనే మన హక్కుల గురించి పోరాడే వీలు కలుగుతుందని స్పష్టం చేస్తున్నది. ఇప్పటివరకు పార్లమెంట్ సమావేశాల్లో కాంగ్రెస్, బీజేపీ ఎంపీల కంటే బీఆర్‌ఎస్ ఎంపీలు సంధించిన ప్రశ్నలే అధికమని, బీఆర్‌ఎస్ ఎంపీల వల్లే కేంద్రం నుంచి పలు కీలక పనులను సాధించుకోగలిగామని పేర్కొంటున్నది.



ఖానాపురం: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న దళితులు

- ఒక్కొక్కరికి రూ.12 లక్షలు చెల్లించాలి
- పాడి గేదెల పైలట్ ప్రాజెక్టును పునరుద్ధరించాలి
- నర్సంపేట డివిజన్‌లో లబ్ధిదారుల డిమాండ్
- తహసీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రాల అందజేత

# దళితబంధు ఇవ్వాల్సిందే..

నర్సంపేట రూరల్/నల్లబెల్లి/ఖానాపురం/చెన్నారావుపేట/నెక్కొండ, జనవరి 9 : దళితబంధు పథకాన్ని కొనసాగించి దళిత కుటుంబాల అభివృద్ధికి తోడ్పడాలని లబ్ధిదారులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. గత బీఆర్‌ఎస్ సర్కారు ప్రవేశపెట్టిన దళితబంధును కొనసాగించడంతో పాటు ఒక్కో లబ్ధిదారుకు రూ.12లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నర్సంపేట డివిజన్‌లోని లబ్ధిదారులు ఆయా మండల కేంద్రాల్లో అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఇప్పటికే రెండో విడుత ప్రొసీడింగ్‌లు ఇచ్చారని వారందరికీ బ్యాంకు ఖాతాల్లో నిధులు జమచేయడంతో పాటు పాడి గేదెల పంపిణీ పథకాన్ని పునరుద్ధరించాలని కోరారు.



చెన్నారావుపేట: తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న లబ్ధిదారులు

బడుగు, బలహీన వర్గాల వారిని ఆదుకోవాలని దళితబంధు లబ్ధిదారులు జమాండ్ల చంద్రమౌళి, బరిగెల కిశోర్‌కుమార్, చిన్నపెల్లి నర్సింగం కోరారు. ఈమేరకు నర్సంపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట వందలాది మంది లబ్ధిదారులు ప్లకార్డులు చేతబూని నినాదాలు చేస్తూ ధర్నా చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీటీ కన్నె రాజ్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో లబ్ధిదారులు ఉల్లేరావు సాంబయ్య, బందెల రాజమౌళి, బరిగెల నవీన్, బరిగెల శ్రీకాంత్, బరిగెల చింటు, కుక్కమూడి శంకర్, జన్ను కొమురుమల్లు, కొంకటి రవీందర్, మామిడాల మధు, పెరుమాండ్ల చిన్నకట్టస్వామి, జమాండ్ల రాజేందర్, శ్రీకాంత్, బరిగెల ప్రేమ్‌చంద్, కొయ్యల సుమన్ పాల్గొన్నారు. నల్లబెల్లిలో దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి భట్టు సాంబయ్య ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ సునీతకు వినతిపత్రం అందజేశారు. రెండో విడుతలో 147మందికి ప్రొసీడింగ్ కాపీలు ఇచ్చారన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పరికి నవీన్, జన్ను జయరాజ్, అడ్డ రాజు, పరికి రత్నం, బొట్ల పవన్ పాల్గొన్నారు. ఖానాపురంలో తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీవో సుమనావాణికి లబ్ధిదారులు వినతిపత్రం అందజేశారు. ఎన్నికల కోడ్ కారణంగా దళితబంధు లబ్ధిదారులకు ఖాతాల్లో డబ్బులు జమ చేయలేదని, ప్రభుత్వం వెంటనే జమ చేయాలని సర్పంచ్ గొర్రె కవిత, దాసరి రమేశ్ డిమాండ్ చేశారు. ఇక్కడ నాగరాజు, సురేశ్, కొమురమ్మ, వెంకన్న, దావీద్, బాబు, ప్రభాకర్, లక్ష్మి, శ్రీను పాల్గొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం తమను రెండో విడుతలో లబ్ధిదారులుగా ఎంపిక చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేయాలని కోరుతూ చెన్నారావుపేటలో సాదు నర్సింగరావు, యాకూబ్, బాలు, కుమారస్వామి, రాజు, సందీప్, తదితరులు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు.

# జాతర పనుల్లో నిండా నిర్లక్ష్యం



బోరుబావిని ఫ్లషింగ్ చేస్తున్న కూలీలు

- బోర్ ఫ్లషింగ్‌పై నిబంధనలకు తిలోదకాలు
- పట్టించుకోని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు
- మొదలుకాని కల్యాణకట్ట పనులు
- టెండర్లు పూర్తయినా పట్టించుకోని దేవాదాయశాఖ


తాడ్వాయి, జనవరి 9 : మేడారం పనుల్లో నిండా నిర్లక్ష్యం కనిపిస్తున్నది. మహాజాతర సమీపిస్తున్నా పనులు నత్తనడకన సాగుతున్నాయి. అరకొరగా జరుగుతున్న పనుల్లోనూ నిబంధనలు పట్టించుకోవడం లేదు. భక్తులకు తాగునీటిని అందించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న చేతిపంపుల ఫ్లషింగ్ పనులు అధికారుల పర్యవేక్షణలో జరగాల్సి ఉండగా కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా చేస్తున్నారు. జాతర పరిసరాల్లో సుమారు 400 బోర్‌బావులు ఉన్నాయి. విడిది చేసే భక్తులకు వీటి ద్వారానే తాగునీరు సరఫరా చేస్తారు. జాతర సమయంలో మాత్రమే వీటిని వినియోగించడంతో ప్రతిసారి ఫ్లషింగ్ పనులు చేస్తారు. అయితే అధికారులు దగ్గరుండీ పనులు చేయించాల్సి ఉన్నా.. వారు పట్టించుకోకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టారీతిన పనులు చేస్తున్నాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకవేళ బోర్ పూర్తిగా ఫ్లషింగ్ కాకుంటే కలుషితమైన నీరు సరఫరా జరిగి భక్తులు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉంది. కోటి మందికి పైగా వచ్చే జాతరలో తాగునీటి విషయంలో జాగ్రత్తలు తీసుకోకుండా హడావుడిగా పనులు చేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**కల్యాణకట్టల మరమ్మతులెప్పుడు..?**

అమ్మవార్లకు తలనీలాలు సమర్పించేందుకు కల్యాణకట్ట షెడ్ల మరమ్మతులు ఇంకా మొదలు కాలేదు. గత జాతర అభివృద్ధి పనుల్లో భాగంగా జంపన్నవాగు ఒడ్డున రెండు షెడ్లు నిర్మించారు. గతేడాది కురిసిన భారీ వర్షాలకు జంపన్నవాగు ఉప్పొంగి కొంగలమడుగు, జంపన్నవాగు వంతెనల సమీపంలోని రెండు కల్యాణకట్టలు కూలిపోయాయి. అప్పటి నుంచి వీటిని దేవాదాయశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. మహాజాతర సమీపించినా పనులు మాత్రం ప్రారంభించలేదు. ప్రస్తుతం ఉన్న కల్యాణకట్టలు సరిపోవు. షెడ్లు మరమ్మతులకు మాత్రం అధికారులు నిధులు మంజూరు చేసి టెండర్లు నిర్వహించారు. అయినప్పటికీ కూలిపోయిన వాటి మరమ్మతులు చేయించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు.

# రామా శ్రీనివాస్ ఇకలేరు

- మోక్షారామం ఫౌండేషన్ వ్యవస్థాపకుడి ఆకస్మిక మృతి
- హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌లో గుండెపోటుతో తుదిశ్వాస
- వరంగల్ నగరంలో విషాదం




పోచమ్మమైదాన్, జనవరి 9 : ప్రముఖ పారిశ్రామికవేత్త, వరల్డ్ పద్మశాలీ క్లబ్ వ్యవస్థాపకుడు, రాష్ట్ర పద్మశాలీ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రామా శ్రీనివాస్ (59) మంగళవారం ఆకస్మికంగా మృతిచెందారు. వరంగల్‌లోని రామన్నపేటకు చెందిన ఆయన హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన హఠాన్మరణాన్ని కుటుంబ సభ్యులు, ఫౌండేషన్ సభ్యులు, నగరవాసులు, పద్మశాలి కులస్తులు తట్టుకోలేకపోతున్నారు. శ్రీనివాస్ భౌతికకాయాన్ని మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, లక్ష్మారెడ్డి, జెన్‌కో మాజీ సీఎండీ ప్రభాకర్‌రావు సందర్శించి నివాళులర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు. వరంగల్ నుంచి చాలామంది కడసారి చూసేందుకు తరలివెళ్లారు.

**సేవా కార్యక్రమాలతో గుర్తింపు**

పారిశ్రామికవేత్తగా ఎదిగిన శ్రీనివాస్, అనేక సేవా కార్యకమాలు చేశారు. తల్లిదండ్రులు ఆగయ్య–ఉప్పలక్ష్మి కోరిక మేరకు రామన్నపేటలో మోక్షారామం ఫౌండేషన్ ఏర్పాటు చేశారు. తద్వారా పేదలు, వృద్ధులు, అనాథలకు సేవలందించారు. రామన్నపేటలో రూ.50లక్షలతో శ్మశానవాటికను అభివృద్ధి చేశారు. అనాథ మృతదేహాలకు ఆయనే అంత్యక్రియలు చేయించేవారు. మోక్షారామం ఫౌండేషన్ ద్వారా రామన్నపేటలో సొంత భవనం నిర్మించి, నిత్యం వృద్ధులు, అనాథలకు అన్నదానం చేస్తున్నారు. ఇప్పటివరకు 250 మందికి మంగళసూత్రాలు, బట్టలు, నగదు సహాయం చేసి పెళ్లి పెద్దగా నిలిచారు. కాశీలో పద్మశాలి సత్రానికి రూ.కోటి, తిరుపతిలో పద్మశాలి సత్రానికి రూ. కోటి, శ్రీశైలంలో అన్నదానం కోసం రూ. 10 లక్షలు, వేములవాడలో నిత్యాన్నదానం కోసం రూ. 8 లక్షలు, గెస్ట్‌హౌస్ కోసం రూ.53లక్షలు, బాసర ఆలయానికి రూ.30లక్షలు, అయోధ్యలో స్థలం కోసం రూ. కోటి, సత్రాల కోసం రూ.50లక్షలు, యాదగిరిగుట్ట కు రూ.30 లక్షలు, రామజన్మభూమి కోసం రూ. 25 లక్షలు విరాళం ఇచ్చారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ శానిటేషన్ నిర్వహణ కోసం రూ.2 కోట్ల విలువైన 420 రిక్షాలు, లక్ష డస్ట్‌బిన్లు అందించారు. హంటర్ రోడ్డులో రూ.50 కోట్లతో వరల్డ్ పద్మశాలి భవనానికి శ్రీకారం చుట్టారు. రూ.40 కోట్లు సొంతంగా రూ.10 కోట్లను పద్మశాలీల నుంచి వాటాధనంగా సమకూర్చారు. తెలంగాణ రాష్ట్ర పద్మశాలీ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఉన్నారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు.

**నేడు అంత్యక్రియలు**

శ్రీనివాస్ అంత్యక్రియలు బుధవారం నిర్వహించనున్నారు. మంగళవారం రాత్రి నాయుడు పెట్రోల్‌పంప్ సమీపంలోని ప్రైవేట్ స్కూల్ వద్దకు భౌతికకాయాన్ని తరలించారు. ఉదయం 10గంటల వరకు ప్రజల సందర్శనార్థం ఉంచి, అనంతరం రామన్నపేటలోని శ్మశానవాటిక వరకు అంతిమయాత్ర నిర్వహించనున్నారు. మోక్షారామం ఫౌండేషన్ ద్వారా అభివృద్ధి చేసిన శ్మశానవాటికలోనే అంత్యక్రియలు జరుగనున్నాయి.



కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయం





వీరభద్రస్వామివారు, భద్రకాళి అమ్మవారు

### నేడు స్వామివారి కల్యాణం..

నేటి సాయంత్రం జరిగే వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. స్వామివారి కల్యాణ మండపంలో ఈ మహోత్సవం వైభవంగా జరుగనుంది. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి కల్యాణ మహోత్సవాన్ని తిలకించాలని ఆలయ ముఖ్య అర్చకులు మొగిలిపాలెం రాంబాబు కోరారు.

# కొత్తకొండ జాతరకు వేళాయె

### నేటి నుంచి బ్రహ్మోత్సవాలు షురూ

*భీమదేవరపల్లి, జనవరి 9 : భక్తుల కొంగుబంగారం కొత్తకొండ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మకర సంక్రాంతిని పురస్కరించుకుని ఈ నెల 10న స్వామివారి కల్యాణంతో ప్రారంభమయ్యే జాతర ఈ నెల 18న స్వామివారి గ్రామ పర్యటనతో ముగుస్తుంది. ఇప్పటికే స్వామివారి కల్యాణ మహోత్సవ వేదిక అందంగా ముస్తాబైంది. జాతరకు తెలంగాణ పలు జిల్లాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు. కోరిన కోర్కెలు తీర్చాలని స్వామి వారికి కోరమీసాలు సమర్పిస్తారు. జాతరలో భక్తుల సౌకర్యార్థం అన్ని వసతులు కల్పిస్తున్నట్లు ఈవో కిషన్‌రావు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజు తెలిపారు. కాగా జాతర ప్రారంభోత్సవంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొననున్నారు.*

- కోరమీసాల స్వామికి కోటి మొక్కులు
- వేలాదిగా తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు చేసిన ఆలయ అధికారులు
- నేటి సాయంత్రం కల్యాణం
- పాల్గొననున్న మంత్రి పొన్నం ప్రభాకర్

**స్థల పురాణం..**

కాకతీయ రుద్రేశ్వరుని కాలంలో మల్లికార్జున పండితుని మనుమడు కేదారి పండితునిచే వీరభద్రస్వామి ఆలయం శైవాగమానుసారం ప్రతిష్ఠింపబడినట్లు స్థలపురాణం చెబుతున్నది. క్రీ.శ.1600 సంవత్సర ప్రాంతంలో కొంతమంది కుమ్మరులు కొండపైకి ఎడ్లబండ్లు కట్టుకుని వెళ్లారు. అక్కడ వారికి అవసరమయ్యే కర్రలు కొట్టుకుని ఎడ్లబండ్లలో వేసేందుకు చూడగా ఎద్దులు, బండి కనిపించలేదు. వారు కొండ చుట్టూ కలియతిరిగి అలసిపోవడంతో ఆ రాత్రి కొండపైనే నిద్రించారు. వీరభద్రస్వామివారు కలలో వారికి కనిపించి నన్ను ఈ కొండపై నుంచి దింపి కింద ఉన్న ఆలయంలో ప్రతిష్ఠింపమని వారిని ఆజ్ఞాపించారు. దీంతో కేదారి పండితునిచే స్వామివారిని కిందకు దింపి ఆలయంలో ప్రతిష్ఠించారు.

**బ్రహ్మోత్సవాల్లో జరిగే కార్యక్రమాలు..**

ఈ నెల 10న సాయంత్రం వీరభద్రస్వామి వారి కల్యాణం, 14న భోగి పండుగ, 15న సంక్రాంతి పర్వదినాన బండ్లు తిరుగుట, 16న నాగవెల్లి, పుష్పయాగం, 17న త్రిశూల స్నానం, 18 తెల్లవారుజామున అగ్నిగుండాలు, అదే రోజున సాయంత్రం స్వామివారి గ్రామ పర్యటనతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

**ఆలయ ఆవరణలో దేవతావృక్షాలు..**

రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా స్వామివారి ఆలయంలో దేవతావృక్షాలు రుద్రాక్ష, జమ్మి, మర్రి, వేప, జుబ్బి, రావి, ఉసిరి ఉన్నాయి. ఫిబ్రవరి, మార్చి నెలలో రాలిపడే రుద్రాక్షల కోసం భక్తులు వేయి కళ్లతో ఎదురుచూస్తారు. బ్రహ్మోత్సవాల్లో రుద్రాక్ష చెట్టును భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుంటారు.

**ఆర్టీసీ ప్రత్యేక బస్సులు**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ జాతరకు స్పెషల్ బస్సులు నడిపిస్తున్నది. వరంగల్–1 డిపో నుంచే కాకుండా హుజూరాబాద్, హుస్నాబాద్ డిపోల నుంచి నేరుగా కొత్తకొండకు స్పెషల్ బస్సులు నిరంతరం నడుస్తాయి.

**అడుగడుగునా నిఘానేత్రాలు**

బ్రహ్మోత్సవాల్లో అడుగడుగునా సీసీకెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. అంతేకాకుండా జాతర ప్రాంగణంలో నలువైపులా రూట్‌మ్యాప్ ఫ్లెక్సీల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ఎవరైనా బ్రహ్మోత్సవాల్లో దారి తప్పితే రూట్‌మ్యాప్ ఆధారంగా గమ్యం చేరుకునేలా సదుపాయం కల్పిస్తున్నారు.

**భారీ పోలీసు బందోబస్తు..**

జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజు ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటుచేస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో 600మంది వరకు పోలీసులు విధులు నిర్వర్తిస్తారని ఆయన తెలిపారు. అడుగడుగునా పోలీసులు పహారా, గస్తీ నిర్వహించనున్నారు.




› మరిన్ని జిల్లా వార్తలు 8వ పేజీలో


### భక్తులకు అన్ని సదుపాయాలు



ఉత్సవాల్లో భక్తుల కోసం అన్ని సదుపాయాలు కల్పించాం. తాగునీటితో పాటు స్నానాల గదులు, మరుగుదొడ్లు ఏర్పాటు చేశాం. పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. వృద్ధుల కోసం వాహనాలు సమకూర్చుతాం. భక్తుల సౌకర్యార్థం పూర్తి వసతులు కల్పిస్తున్నాం. వైద్యశిబిరం, అగ్నిమాపక యంత్రాలు అందుబాటులో ఉన్నాయి.

– కిషన్‌రావు, ఆలయ ఈవో


**ఫారం నం. URC-2**

**చట్టంలోని చాప్టర్ XXI లో పార్ట్ I క్రింద రిజిస్ట్రేషన్ గురించి నోటీసు ఇస్తూ ప్రకటన [కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 374 (b) మరియు కంపెనీస్ (ఆథరైజ్డ్ టు రిజిస్టర్) రూల్స్, 2014లోని రూల్ 4(1) కు అనుగుణంగా]**

1. కంపెనీల చట్టం, 2013 (చట్టం)లోని సెక్షన్ 366లో సబ్–సెక్షన్ (2) ననుసరించి CRC వద్ద రిజిస్ట్రార్‌కి, **కాసం ఎత్నిక్ వేర్ అనే భాగస్వామ్య సంస్థ**, కంపెనీ లిమిటెడ్ బై షేర్స్‌గా కంపెనీల చట్టం, 2013లోని చాప్టర్ XXIలో పార్ట్–I క్రింద రిజిస్టర్ కావచ్చునని, దరఖాస్తు చేసేందుకు ప్రతిపాదించబడినదని ఇందుమూలంగా తెలియజేయడమైనది.
2. **ప్రతిపాదించబడిన కంపెనీ యొక్క ప్రధాన లక్ష్యాలు దిగువ విధంగా ఉన్నవి :**

a. అన్ని రకాల అప్పరెల్స్, డ్రెస్‌లు, క్లాత్స్, ఔట్‌ఫిట్స్, గార్మెంట్స్, ఫ్యాబ్రిక్స్, టెక్స్‌టైల్స్, యార్న్, ఫైబర్స్, గార్మెంట్స్ కవరింగ్స్, హోసరీ & సిల్క్ వంటి వాటిలో క్రయ, విక్రయం, దిగుమతి, మర్చండైజర్స్, ట్రేడర్స్, కోఆర్డినేటర్స్, డిస్ట్రిబ్యూటర్స్ మరియు/లేదా ఇతరత్రా వ్యాపారం లేదా అన్ని రకాల మరియు విధముల మరియు అన్ని ఫైబర్స్, సింథటిక్ ఆర్టిఫిషియల్ & నేచురల్ ఫైబర్స్, నైలాన్, రేయన్, జూట్ మరియు ఏదైన ఇతర ఫైబర్స్ లేదా ఫైబర్ రకపు మెటీరియల్స్ టెక్స్‌టైల్స్ సబ్‌స్టెన్స్ సంబంధ ఉత్పత్తులు, ఉప– ఉత్పత్తులు మరియు సబ్‌స్టిట్యూట్స్ పైవన్నీ లేదా వాటిలో ఏదైనా దానికోసం మరియు యాక్సరీస్ యొక్క వర్తకవ్యాపారం నిర్వహించుట.

3. ప్రతిపాదించబడిన కంపెనీ యొక్క డ్రాఫ్ట్ మెమొరాండం మరియు ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్ కాపీని డోర్ నం. 1–8–560/3,4, నక్కలగుట్ట, హనుమకొండ, వరంగల్ జిల్లా, తెలంగాణ వద్దగల కార్యాలయంలో తనిఖీ చేసుకోవచ్చును.
4. ఈ దరఖాస్తుకు అభ్యంతరం తెలిపే ఎవరైనా తమ అభ్యంతరాన్ని వ్రాతపూర్వకంగా **రిజిస్ట్రార్, సెంట్రల్ రిజిస్ట్రేషన్ సెంటర్ (CRC), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ (IICA), ప్లాట్ నం. 6,7,8, సెక్టార్ 5, IMT మానేసర్, జిల్లా గుర్గావ్ (హర్యానా), పిన్‌కోడ్ –122050** వారికి, దాని నమోదిత కార్యాలయం వద్ద కంపెనీకి ఒక కాపీతో ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి ఇరవై ఒక్క రోజులలోగా తెలుపవచ్చును.

**కాసం ఎత్నిక్ వేర్ (భాగస్వామ్య సంస్థ) తరపున**

సం/– నమశివాయ కాసం, భాగస్వామి
సం/– శివ ప్రసాద్ కాసం, భాగస్వామి
సం/– పుల్లూరు స్రవంతి, భాగస్వామి
సం/– సంజయ్ బొహ్రా, భాగస్వామి
సం/– కాసం కేదారి, భాగస్వామి
సం/– యాంసాని ప్రవీణ్ కుమార్, భాగస్వామి
సం/– కాసం ధనలక్ష్మీ, భాగస్వామి

తేది: 10–01–2024
ప్రదేశం: వరంగల్